# ఈ గదిలోనుండి - ఈ ఒడిలోనుండి

రామాచంద్ర మౌళి

**ఒకటే** ఎడతెగని వర్షం.

రోడ్డుపై వీధుల నిండా. నగరంపై వర్షం...వర్షం.

కిటికీలో నుండి చూస్తోంది గాయత్రి.

కన్నుల్లోనుండి గుండె పైకి. జీవితంలోకి వర్షం.

క్రోటన్ ఆకులపై చినుకులు బాణాల్లా కురుస్తున్నాయి. ఆకు అదిరిపడ్తూ. వణికిపోతూ ఎన్ని పిడుగులు; ఎన్ని మెరుపులు, ఎన్ని తుఫాన్లు!!

వణికి పోవడం, గడ్డిపోచలా నిలబడి బ్రతుకునెదిరించడం. పోరాటం చేయడం. చిరుదీపంలా జ్వలిస్తూ జీవించడాన్ని నేర్చుకోవడం.

దీపం-దీపం.

దీపం వెలిగించాలి. చీకటి పడిపోతోంది.

ముసురు-మసక చీకటి. ఎటు చూచినా తడి. ఏదో ముక్క వాసన. ఏవో జ్ఞాపకాలు. ఎన్నో బాధలు. పలకరించే స్మృతులు. అలసిపోయిన అనుభవాలు. ఇవన్నీ ఆ గదిలో క్షిప్తమై పరివ్యంగంలోకి పిలుస్తున్నట్లు ఏదో 'పాత' వాసన.

పాతది. ఈ గది పాతది. ఈ జీవితం పాతది. ఈ చూపులు పాతవి. ఈ నిరీక్షణ పాతది. మరి హృదయమో! హృదయం కొత్తది. ఈ రోజును జయించి రేపును సొంతం చేసుకోబోయే హృదయం కొత్తది.

హృదయం నిప్పులా మండి. మండుతూ నిరంతరం కన్నీటి ధారలతో తడుస్తున్నా జ్వలిస్తూ జీవితానికి ఓ లక్ష్యాన్ని నిర్దేశించి. గమ్యంకోసం బ్రతకడం నేర్చి.

ఓ పక్షిని చూచి. ఓ దీపాన్ని చూచి. ఓ ఆకారాన్ని చూచి. ఓ పువ్వుని చూచి ఎంత ధైర్యం తెచ్చుకుందో తను. ఎంత స్ఫూర్తిని పొందిందో తను. ఎంత దీక్షనూ, పట్టుదలనూ నేర్చుకుందో తను.

ఎక్కడో పిడుగు పడ్డ చప్పుడు ఫెళఫెళమని.

ఉలిక్కి పడ్డది గాయత్రి.


వర్షం కనిపించడం లేదు-వినిపిస్తోంది. నల్లగా చీకటి. ఎప్పుడో చీకటి పడ్డది. తెలియడం లేదు.


గదిలో వెదుకుతోంది అగ్గిపెట్టె కోసం.

వెదుక్కోవడమే జీవితమంతా. వెలుతురు కోసం. జంట కోసం. బ్రతుకు కోసం.

అగ్గిపెట్టె దొరికింది. నర్రున పుల్ల గీసి...ఎర్రగా మంట.

దీపాన్ని వెలిగిస్తూండగా ఎదురుగా అద్దంలో





ఎర్రగా ఆమె ముఖం మందారంలా కనిపించి. మెరుస్తూ-ఎన్ని తెల్ల వెంట్రుకలు తలనిండా.


నలభై మూ డేళ్ళ బరువు నెత్తిపై...

నలభై మూ డు వర్షాలు.

నలభై మూ డు వసంతాలు కావు-

ఆ రోజు కూడా ఇదే వర్షం. ఇదే చీకటి. ఇదే కన్నీరు-ఆనందంతో చిమ్ముకొచ్చే కన్నీరు.

"గాయత్రీ! జీవితానికి ఓ లక్ష్యం. ఓ గమ్యం. దాన్ని సాధించడానికి సాధనా ఉండాలి. ఒట్టి బ్రతకడం కోసం చేయొద్దు పశువులా! జీవితంతో పోరాడి గమ్యాన్ని చేరుకోవాలి."



మొదటి రాత్రి అతను చెవుతున్న మాటలకు పులకించిపోతూ ఓ ప్రకృతిలా. ఓ చెట్టులా. ఓ జ్వాలలా వింటూ పొంగిపోయి. పొర్లిపోయి. కన్నీట్లో తడుస్తూ.

ఈ గదిలోనే-

అతని బాహువుల్లో ఇమిడిపోతూ-

అతని కన్నుల్లోకి చూస్తూ-

"ఈ దేశంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంత ఉదాత్తమైందో దురదృష్టవశాత్తు ఎవరూ తెలుసుకోవడం లేదు. ఓ హంతకుని వలన ఒక రిద్దరు ప్రాణాలను కోల్పోతారు. కాని. ఓ ఉపాధ్యాయుడు అసమర్థుడైతే ఓ తరమే నిర్వీర్యమైపోతుంది. ఈ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. గాయత్రీ!"

లవ్ యువర్ ప్రొఫెషన్.

లవ్ యువర్ నైబర్.

లవ్ యువర్ కంట్రీ- పరిధి విస్తృతమై వ్యాపించి వ్యాపించి వసుధైక కుటుంబం దిక్కు-

ఏవి సిద్ధాంతాలు. ఏవి సూత్రాలు. ఏవి శాస్త్రాలు-వద్దీ మీమాంస-

నిన్ను నువ్వు ధర్మబద్ధం చేసుకో-ప్రపంచం సుభిక్షమౌతుంది.

అదొక్కటే వసంతం.

తర్వాతంతా వర్షమే!

'మనకు బాబు పుట్టబోతున్నాడండీ' అని తనాయనతో చెప్పిన రాత్రి కూడా ఎడతెగని వర్షమే.

అతను నవ్వడం-సరిగ్గా అప్పుడే మెరుపు మెరవడం బాగా జ్ఞాపకం-ముద్రించుకుపోయిన జ్ఞాపకం.

తర్వాత వర్షాకాలంలో-

బాబు పుట్టడం, సరిగ్గా అదే రాత్రి ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడుగా సన్మానించబడడం-

ఈ గదిలోనే పులకించిపోవడం-హృదయం పురి విప్పి నృత్యం చేయడం...

బయట తలుపుల పై ఎవరో బాదుతున్న చప్పుడు.

ఆ నాటి రాత్రి కూడా కచ్చితంగా ఇదే చప్పుడు-అదే దబదబ!

పరుగున వెళ్ళి తలుపు తీసింది తను.

ఎదురుగా ఆటో-తలనుండి రక్తం ప్రవహిస్తూ ఎర్రగా నెత్తురులో తడిసిన ఆయన! కెవ్వున అరిచింది తను.

"లారీ క్రింద...యాక్సిడెంటయిందమ్మా!" అంటున్నా రెవరో!

"గాయత్రీ! యూనియన్ గొడవలు. వట్టువద్దలని నా పోరాటం. నన్ను మభ్యపెట్టాలని వాళ్ళ ప్రయత్నాలు-ఎందుకో పరిస్థితి మబ్బు పట్టిన ఆకాశంలా ఉంది. గాయత్రీ! ఏదైనా జరగొచ్చు."

రెండ్రోజుల క్రిందటి అతని మాటలు ధ్వనిస్తున్నాయి.

ఘోరం జరిగిపోయింది.

చేతిలో లోకం తెలియని పసిగుడ్డు. ఎదుట లోకాన్ని విడిచిన ఆయన.

కళ్ళనిండా వర్షం. హృదయంలో ప్రశ్న.

"గాయత్రీ! జీవితం ఓ సవాల్! నిరంతర పోరాటం! అలసిన యాత్రను విరమించడం పిరికితనం!"

అవును. అవును.

అతని జ్ఞాపకాలనుండి స్ఫూర్తి. కాలేకొవ్వొత్తి నుండి స్ఫూర్తి. ఓ జీవితం నుండి మరో జీవితానికి ఊపిరి ఇవ్వాలని ఆకాంక్ష. పాదుకుపోయి బలంగా మొలకెత్తే లక్ష్యం.

ఆ వర్షం కురిసిన రాత్రే నిర్ణయించుకుంది తను-ఇక బాబునే భవిష్యత్తు చేసుకుని. కేంద్రం చేసుకొని-,

భరత్-భరత్ బ్రతుకనుకుంది.

భరత్‌ను మనిషిని చేయడం. భరత్‌ను ఈ సంఘానికి దానం చేయడం, భరత్‌ను భరత మాత పాదాల దగ్గర అర్పించడం-కన్నీళ్ళు పొంగి రావడం-సాధనకు అంకితమై పోవడం.

భరత్‌కి చిటికెన వ్రేలు అందించి నడిపించి-

అడుగులు తన హృదయంపై పడుతుంటే పొంగిపోవడం-

ఓ బోసి నవ్వుకోసం శేషజీవితాన్ని ఆధారం చేయడం-

జ్ఞాపకాల్లో బ్రతుకుతూ

బ్రతుకు నివ్వడం కోసం జ్ఞాపకంగా మిగిలిపోవడం.

భరత్ అయిదవ తరగతిలోనే అసాధారణమైన బాలునిగా గుర్తింపు పొంది పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ప్రత్యేక బహుమతి పొందడం-

వాని నడకలో, ప్రవర్తనలో, కృషిలో నీడై, తోడై, గురువై, స్నేహితురాలై, అమ్మయి, ఆత్మయి...

పూవు వికసిస్తుంటే మొక్క పొంగిపోయినట్లు-

చినుకులు కురుస్తుంటే ఆకాశం పరవశించి కరిగిపోయినట్లు-

భరత్ పెరిగి, ఎదిగి స్కూల్ ఫైనల్‌లో రాష్ట్రస్థాయి రాంక్ పొంది విద్యా శాఖచే బంగారు పతకం పొందిన రోజు కూడా-

ఇదే వర్షం-ఇదే ముసురు.

ఈ గదిలోనే భరత్ పతకాన్ని తన మెడలో వేసి వంగి పాదాలకు నమస్కరిస్తున్న క్షణం-ఆయన్ను తలచుకుంది. 'మీ ఆదర్శాలకు తగ్గట్టుగా ఈ కన్నీళ్ళను దిగమ్రింగి, కష్టాలను మోసి ఇదిగో వీడిని తయారు చేస్తున్నాను' అని నివేదించిన క్షణం-

ఒట్టి మౌన కడలిలా, నిశ్శబ్ద సూర్యునిలా-

వర్షాలు గడుస్తున్న కొద్దీ-

భరత్ కాలేజీలో చేరి, ఇంజినీరింగ్‌లో సీటు సంపాదించుకుని ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు పొంది, బి.టెక్. పూర్తి చేసి, ఎమ్.టెక్. కూడా ముగించి-యూనివర్సిటీ ఫస్ట్‌గా అయిదు బంగారు పతకాలను గెలుచుకుని వాటిని పొందడానికి వెళ్తూ తనను కూడా కాన్వకేషన్‌కు తీసుకెళ్ళిన రోజూ కుండపోతగా వర్షమే!

గర్వించింది తను భరత్‌ను కన్నందుకు. పొంగిపోయింది తను భరత్‌ను ఇంతవాణ్ణి చేసినందుకు. కష్టాలు, కన్నీళ్ళను చవిచూసిన ఈ గదిలోనుండి సమాజానికి ఉపయోగపడే ఓ ఇంజినీరై భరత్ ప్రపంచంలోకి వచ్చినందుకు.

ప్రభుత్వం వెంటనే ఉద్యోగ మిచ్చింది అసిస్టెంట్ ఇంజినీర్‌గా.

దాదాపు రెండు వేల జీతం.

జీవితం దొరికింది. బాధ్యతలు నిలబడి ఉన్నాయి బాహువులపై. సంఘం తయారుచేసిన మనిషి సంఘం కోసం శ్రమించవలసిన అవసరం. సంఘం కోసం జీవించాల్సిన ధర్మం. సంఘం కోసమే మరణించాల్సిన అవసరం గురించి తను భరత్‌తో చెప్పాలనుకుంటున్న ఈ రాత్రి కూడా-

వర్షం-

ఎడతెరిపి లేని వర్షం.

గుమ్మంపై దడదడ చప్పుడు-చాలా సేపైంది చప్పుడు వినబడబట్టి.

ఉలిక్కిపడి లేచింది గాయత్రి.

ఆమె కళ్ళనుండి నీళ్ళు కారుతున్న విషయం ఆమెకు తెలియడం లేదు.

*** *** ***

తలుపులు తెరిచింది గాయత్రి.

ఎదురుగా భరత్-ఆనందోద్వేగంతో. వీధిలో కారు. కారుపై కుండపోతగా కురుస్తున్న వర్షపు ధారలు.

"అమ్మా! ఎంత సేపైందమ్మా పిలువబట్టి: పద పద-నేను వెంటనే బయల్దేరి వెళ్ళాలి. టైమ్ లేదు. నువ్వు కూడా రావాలి వెంట. తొందరగా తయారవు."

"ఎక్కడికిరా?"

"దార్లో చెప్తాను గదా! వింటే ఉక్కిరి బిక్కిరై పోతావు నువ్వు! కమాన్, కమాన్!"

అదే గదిలో హడావిడి. గజిబిజి. పురమాయింపు. పెట్టేబేడా సర్దుకోవడం.

'ఎక్కడికి? ఎందుకు? ఏమిటి?'

తయారైంది గాయత్రి.

డ్రైవర్ సామాను కార్లో పెట్టి-స్టార్టయింది ప్రయాణం.

చిక్కడపల్లి...ముషీరాబాద్ । । । బాకారాం...

"నా పిహెచ్.డి. అయిన తర్వాత మా ప్రొఫెసర్ అమెరికా వెళ్ళాడని చెప్పాను గదమ్మా-డాక్టర్ రామనాథం-ఈ రోజే టెలెక్స్ మెసేజ్ పంపించారు అర్జంట్‌గా ఈ రోజు ఫ్లైట్‌లో బయల్దేరి రమ్మని."

"ఎందుకు?"

"ఎందుకేమిటి, పిచ్చీ! బ్రహ్మాండమైన ఉద్యోగం చూసి పెట్టారట."

గాయత్రి ఉలిక్కి పడింది.

వర్షం తుఫానై-

కారు చప్పుడు హోరై-

హృదయం బ్రద్దలైన అగ్ని పర్వతమై-

గాయత్రి మౌనదేవతై-

"అమ్మా, ఎంత జీతమో తెలుసా! వింటే ఆశ్చర్యపోతావ్! నీ కొడుకు విలువ ఇంతా అని సంబరపడిపోతావ్!"

ఆమె వింటోంది. మాటలు రావడం లేదు.

కారు పరుగెత్తుతోంది బేగంపేట వైపు.

"ఇరవై రెండు వేలు నెలకు! ఎర్-కండిషన్డ్ అపార్ట్‌మెంట్, ఎ.సి. కార్..." చెబుతున్నాడు.

మౌనం.

"ఓ ఆర్నెల్ల తర్వాత నేను మేనేజింగ్ డైరెక్టర్ని."

". . . . ."

"నెలకు ముప్పై వేల పైననే!"

". . . . . ."

"ఇంకా పది నిముషాలే ఉందమ్మా ఫ్లైట్ టేకాఫ్‌కు."

". . . . ."

కారు ఏర్‌పోర్టులో ప్రవేశించి-

"డ్రైవర్! క్విక్-సామాను పట్రా!"

మైక్‌లో "డాక్టర్ భరత్..." ఇంకొందరి పేర్లు పిలవబడ్తున్నాయి.

బయట ఆకాశం ఏడుస్తున్నట్లు భోరున వర్షం కురుస్తూనే ఉంది.

టికెట్ కౌంటర్‌లో ఎంట్రీ చేయించుకుని, హడావిడిగా ఫార్మాలిటీసి పూర్తి చేసుకుని భరత్ రన్‌వేపై ఆగి ఉన్న విమానం వంక ఆశగా చూస్తూ, గాయత్రి దగ్గర కొచ్చి పాదాభివందనం చేస్తూ-

"నువ్వు సుఖంగా బ్రతకడానికి సరిపడే జీతం ఇక్కడ కూడా దొరుకుతోంది గదా, నాన్నా! నువ్వు పోవడమెందుకురా?" దుఃఖం కట్టలు తెంచుకుంటోంది.

"నీ కర్థం కాదమ్మా. ఆ డిగ్నిటీ వేరు. నేను ఓ ఆర్నెల్లలో వచ్చి నిన్ను తీసుకెళ్తాను. అంతా వివరంగా రాస్తాను గదా!"

"నేను ఈ దేశాన్ని విడిచి బ్రతకలేనురా. అక్కడ నీకు ఎన్ని సుఖాలున్నా, అమ్మ ఉండదు గదరా, భరత్! నిన్ను పెంచి, పోషించి, నీకు జీవితాన్నిచ్చిన ఈ దేశాన్ని వదలి..." ఆమె మాటలు పూర్తి కానే లేదు.

"టైమ్ లేదమ్మా. నన్ను క్షమించు..." పరుగెత్తుతున్నాడు భరత్ రన్‌వే దిక్కు.

సముద్రం వర్షమై కురుస్తోం దామె కన్నుల్లో. ఎదుట ఏదీ కనిపించడం లేదు. అంతా ఒట్టి చీకటి.

*

